

పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రండి..

● కెనడా కమిషనర్‌కు సిఎం రేవంత్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెనడా హైకమిషనర్‌ను కోరారు. హైకమిషనర్ ఆఫ్ కెనడా టు ఇండియా క్రిస్టోఫర్ కూటర్ బృందం శనివారం హైదరాబాద్‌లో సిఎంతో భేటీ అయ్యింది. ఐటీ, ఫార్మా, ఎయిరోస్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై ఈ సమావేశంలో చర్చించారు. తమ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు సిఎం వివరించారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలోనూ పెట్టుబడులకు ముందుకు రావాలని ఆయన ఈ సందర్భంగా కెనడా హైకమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. భేటీలో కారెన్, కెనడా మంత్రి ఎడ్ జాగర్, ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌తో సుదర్శన్‌రెడ్డి భేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన సుదర్శన్ రెడ్డి. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలున్నారు.

ఫ్రెంచ్ కార్యాలయాన్ని బలోపేతం చేయండి

● సిఎం రేవంత్ సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందానికి సూచించారు. శనివారం ఆ బృందం సిఎంతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. ఫ్రాన్స్‌కు సంబంధించి హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై ఈ సందర్భంగా చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బందాన్ని సిఎం కోరారు. సమావేశంలో మౌద్ మిక్వా, స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ తదితరులు

టూరిస్ట్ హబ్‌గా నర్సాపూర్ అర్బన్ ఎకో పార్కు

● దేవాదాయ ధర్మాదాయ పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రానికి తలమానికంగా నర్సాపూర్ అర్బన్ ఎకో పార్క్ ఉంటుందని దేవాదాయ ధర్మాదాయ పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం నర్సాపూర్ నియోజకవర్గంలో ఎకో పార్క్, పార్కు కాటేజీలను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఎకో పార్క్ వంటి ప్రాజెక్టులు కొత్త తరానికి స్ఫూర్తినందించే విధంగా ఉంటాయన్నారు. పార్కులోని అరుదైన మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా, వేదికలు, లగ్జరీ సదుపాయాలు, పిక్నిక్ స్పాట్స్, ఈవెంట్స్ నిర్వహించుకునే సదుపాయాలు సందర్శకులను ఆకట్టుకుంటాయని అన్నారు. ఎంపి రఘునందన్ రావు మాట్లాడుతూ.. వందేమాతరం గీతంలోని సుజలం, సుఫలాం, మలయజ సీతలాం పదాలలోని ఏదీ అమలవుతలేదని అన్నారు. ఎకో పార్కు చెరువు డంపింగ్ యార్డ్ కావద్దన్నారు. గ్రామాలు పిలుస్తున్నాయి అనే నినాదం రావాలన్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నర్సాపూర్ నియోజకవర్గానికి అడవి ఒక ఆస్తి, వరం అన్నారు. పార్క్ వల్ల నర్సాపూర్ కు మరింత గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యావరణం అడవులు సైన్స్ అండ్ టెక్నాలజీ హమ్మద్ నదీమ్, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి, సువర్ణ, ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మృగవని గ్రూప్ ఆఫ్ రిసార్ట్స్ ఎండి, విష్ణు చైతన్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోరబండ చౌరస్తాకు పిజెఆర్ పేరు

● బిఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతోనే బిజెపికి ఎనిమిది ఎంపి సీట్లు
● బోరబండ కార్నర్ మీటింగ్‌లో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బోరబండ చౌరస్తాకు పిజెఆర్ పేరు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇచ్చి నవీన్ యాదవ్‌కు ఓటేసి గెలిపిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని హామీనిచ్చారు. శనివారం రాత్రి బోరబండలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సిఎం మాట్లాడారు. గత ఎన్నికల్లో అజారుద్దీన్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తామని మాట ఇచ్చామనీ, జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి మీ ముందుకు తీసుకొచ్చా అన్నారు. కారు షెడ్డుకు పోయిందనీ, బిల్లా రంగాలు ఆటోల్లో తిరిగి మిమ్మల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ఇవాళ కొత్తగా జూబ్లీహిల్స్‌లో సమస్యలు వచ్చినట్టు మాట్లాడుతున్నారనీ, సెంటిమెంట్ పేరుతో ఓట్లు దండుకోవడానికి వస్తున్నారన్నారు. 2007లో పీజేఆర్ చనిపోతే ఏకగ్రీవం చేయాలంటే అభ్యర్థిని పెట్టి ఎన్నికలు తెచ్చిన వ్యక్తి కెసిఆర్ అన్నారు. పేదలను ఆదుకున్న చరిత్ర పిజెఆర్‌ది అనీ, ఇక్కడి బస్తీల్లో ఏ తలుపు తట్టినా పిజెఆర్ సాయం పొందినవారే ఉంటారని తెలిపారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఈ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇప్పుడొచ్చి సమస్యలను పరిష్కరిస్తామని కల్లబొల్లి మాటలు చెప్తే ఇక్కడి జనం నమ్మరు అన్నారు. అందరికీ రేషన్ కార్డులు ఇచ్చామనీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలందరికీ సన్నబియ్యం. ఆడబిడ్డలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని రద్దు చేయాలని బిఆర్ఎస్ వాళ్లు మాట్లాడుతున్నారనీ, ఇదీ వాళ్ల గలీజ్ బుద్ధి అన్నారు. 2014 నుంచి ఒక్క ఆడ బిడ్డకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదనీ, తమ ప్రభుత్వంలో సీతక్క, కొండా సురేఖను మంత్రి పదవులు ఇచ్చామని చెప్పారు. శిల్పారామం దగ్గర మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం స్టాల్స్ ఇచ్చామని తెలిపారు. మున్సిపల్ మంత్రిగా ఉండి కూడా జూబ్లీహిల్స్ సమస్యలను కెటిఆర్ పరిష్కరించలేదన్నారు. ఈ నియోజకవర్గం నుంచి కేంద్ర మంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదనీ, బోరబండకు వచ్చి ఎందుకు సమస్యలు పరిష్కరించలేదని ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కెటిఆర్.. సునీతమ్మను మంచిగా చూసుకుంటాడు అని వాళ్ల చెల్లెలే బయటకు వచ్చి చెబుతుందాన్నరు. నవీన్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతంలో ఉన్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత నవీన్ తీసుకుంటాడని తెలిపారు. నవీన్‌ను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో బిజెపి లోపయికారి ఒప్పందం చేసుకోవడంతోనే బిజెపికి ఎనిమిది ఎంపి సీట్లు వచ్చాయన్నారు.

జనవరి 5,6,7 తేదీల్లో పిఎన్‌ఎం రాష్ట్ర మహాసభ

● తెలంగాణ జానపద ఉత్సవాలు
● హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదిక
● పోస్టర్ ఆవిష్కరించిన సినీనటుడు మాదాల రవి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాదాల రవి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా నాట్య మండలి (పిఎన్‌ఎం) రాష్ట్ర మూడో మహాసభలతోపాటు తెలంగాణ జానపద ఉత్సవాలు వచ్చేఏడాది జనవరి ఐదు, ఆరు, ఏడు తేదీల్లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్నాయి. ఈ మహాసభలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాన్ని శనివారం హైదరాబాద్‌లో సినీనటుడు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు మాదాల రవితోపాటు ప్రధాన కార్యదర్శి ఎన్ మారన్న, దర్శకుడు, మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్, ఎఐఇఐఎ సౌత్ సెంట్రల్ జోన్ సంయుక్త కార్యదర్శి జి తిరుపతయ్య, పోస్టల్ యూనియన్ ఉమ్మడి ఎపి సర్కిల్ మాజీ కార్యదర్శి డివిఎస్‌ఎ ప్రసాద్, ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమి ఎఒ కె సతీశ్‌కుమార్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదాల రవి మాట్లాడుతూ కళ కల కోసం కాసుల కోసం కాదు ప్రజల కోసం, చైతన్యం కోసమని అన్నారు. ప్రజల సమస్యలే ఇతివృత్తంగా తీసుకుని పిఎన్‌ఎం పాటలు, కళారూపాల ద్వారా వారిలో చైతన్యాన్ని పెంపొందిస్తున్నదని చెప్పారు. ఎంతో మంది నటులు, కళాకారులు, గాయకులు, నిర్మాతలు, దర్శకులను తయారు చేసిన ఘనత పిఎన్‌ఎంకు ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సామాన్యులను తిరుగుబాటు చేసే స్థాయికి చేరేలా చేసిందని అన్నారు. మాభూమి నాటకం వీధివీధిన వేసి ప్రజలను ప్రేరేపితం చేసిందని వివరించారు. ప్రజా సమస్యలపైనే గళం ఎత్తిందన్నారు. వామపక్ష పార్టీలు చేసే పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచిందని చెప్పారు. ప్రజలను చైతన్యం చేసేందుకు కళ అతిపెత్త మాధ్యమం అని అన్నారు. ప్రజాకళకు మించిన ఆయుధం మరొకటి లేదన్నారు. వైద్యుడు మనుషులకు ఉన్న జబ్బును నయం చేయాలనీ, ప్రజా కళాకారులు సమాజానికి పట్టిన జబ్బును వదలగొట్టాలని అన్నారు. వందేళ్ల సినీ చరిత్రలో అద్భుతమైన చిత్రాలు వచ్చాయంటే పిఎన్‌ఎం కళాకారుల కృషి ఉందన్నారు. విద్యావైద్యంతోపాటు సినిమాలు, సీరియల్స్ కూడా వ్యాపారమయం అయ్యాయని విమర్శించారు. వ్యవస్థ మారాలంటే కళాకారుల చేతుల్లోనే ఉందని అన్నారు. సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరముందన్నారు. ప్రజా కళాకారులు, అభ్యుదయవాదులు ఐక్యం కావాలని కోరారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ మారన్న, దర్శకుడు, మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్, ఎఐఇఐఎ సౌత్ సెంట్రల్ జోన్ సంయుక్త కార్యదర్శి జి తిరుపతయ్య మాట్లాడుతూ కళ ప్రజల కోసం, కళ ప్రగతి కోసం అని చెప్పారు. జానపద కళలకు జీవం పోసి ప్రజా చైతన్యాన్ని రగిలించింది పిఎన్‌ఎం అని అన్నారు. మనిషిలో ఉన్న మానవత్వాన్ని మేల్కొల్పడం ప్రజా కళాకారులందరి కర్తవ్యమని చెప్పారు. జనవరి ఐదు, ఆరు, ఏడు తేదీల్లో జరిగే పిఎన్‌ఎం రాష్ట్ర మూడో మహాసభలకు ప్రజా వాగ్గేయకారులు, రచయితలు, గాయకులు, జానపద కళాకారులతోపాటు 600 మంది ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. తెలంగాణ జానపద ప్రజా కళారూపాల సంపదను భావితరాలకు అందించడం కోసం విదేశీ విష సంస్కృతిని తరిమికొట్టడం కోసం కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ యూనియన్ నాయకులు సురేశ్, ఎన్‌పిఆర్డీ నగర కార్యదర్శి ఆర్ వెంకటేశ్, పిఎన్‌ఎం రాష్ట్ర మహాసభల గౌరవ సలహాదారులు కెఎన్ రాజన్న, పి మల్లేశ్, కోశాధికారి కల్యాణ్, పిఎన్‌ఎం నాయకులు కొండూరి భాస్కర్, సూరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎఇఎస్, ఎస్ఐలకు శిక్షణ

● తొలి విడుతలో 6 నెలల పాటు తర్ఫీదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూపు 1 ద్వారా ఎంపికైన 31 మంది ఎక్సైజ్ ఎఇఎస్ (అసిస్టెంట్ సూపరిడెంట్) అభ్యర్థులు, గ్రూపు 2 ద్వారా ఎస్ఐలుగా ఎంపికైన 84 మంది అభ్యర్థులకు శనివారం హైదరాబాద్‌లోని ఎక్సైజ్ అకాడమీలో శిక్షణ ప్రారంభమైంది. గ్రూపు 1 ద్వారా ఏఈఎస్‌లుగా చేరిన 31 మందిలో 8 మహిళలు, 23 పురుషులు ఉన్నారు. గ్రూపు 2 ద్వారా ఎస్సైలుగా చేరిన వారిలో 24 మహిళలు, 60 మంది పురుషులు ఉన్నారు. తొలివిడుతలో ఆరు నెలల పాటు ఎక్సైజ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆకాడమీ డైరెక్టర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. శిక్షణ అనంతరం జోన్ల వారీగా ఎంపికైన వారికి పోస్టింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వండి

● సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ వానాకాలం వరి, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ పంటల దిగుబడి బాగా వచ్చిందని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి తెలిపారు. సీజన్ ప్రారంభంలో వచ్చిన వానల కంటే 'మొంథా తుఫాను' అన్ని పంటలను మరింత దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను శనివారం ఆయన లేఖ రూపంలో సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎండబోసిన వరి ధాన్యం తడిసిందని, ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలని రైతు కోరినట్టు పేర్కొన్నారు. ఆదిలాబాద్ లాంటి కొన్ని ప్రాంతాల్లో కొంత సోయాబీన్ పంట చేతికొచ్చిందని గుర్తు చేశారు. దాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలనే విషయాన్ని రైతులు తమ దృష్టికి తెచ్చినట్టు పేర్కొన్నారు. ఇళ్లలో నిల్వ ఉంచుకున్న పత్తికి తేమ శాతం నుంచి మినహాయించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా కొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తడిసిపోయిన ధాన్యాన్ని కోళ్ల ఫారాల యాజమానులు కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరుశనగ పంట భారీగా నష్టపోయిందని, పెసర, మినుము, కుసుమ, నువ్వులు మొదలైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలని కోదండరెడ్డి కోరారు.

IN THE COURT OF THE HONBLE MACT-CUM- XII ADDL. DISTRICT JUDGE AT :: L.B.NAGAR.
M.V.O.P. No. 20 OF 2021.

BETWEEN:
B. Manga and Others ...Petitioner/s
AND
Rambabu Dharavath & Others ... Respondent/s

To,
Davuluri.Sanjay, S/o. D. Satya Narayana, H.No.4-8-8/3, Sy.No.30, Munganoor Village, Abdullapurmet, Ranga Reddy District.

The above named Plaintiffs have filed the M.V.O.P bearing No.20 of 2021 on the file of the HON'BLE COURT OF MACT - CUM-XII ADDL. DISTRICT JUDGE AT: L.B.NAGAR. The Hon'ble Court directed the defendant to add proper and necessary party in the above M.V.O.P No.20 /2021 as Respondent No.5 Davuluri.Sanjay, S/o. D. Satya Narayana. Please take notice that the above M.V.O.P. 20/2021, stands posted to 13/11/2025 for appearance of interest persons and take notice that the concerned are required to appear before the Hon'ble Court on or before **13/11/2025** and in case of default to appear in person or through counsel, the above M.V.O.P will be heard and determined in the absence.
(BY ORDER OF THE HON'BLE COURT)

Sd/- V.Y.DAS,
Advocate,
D.No. 6-6-33, 201. Gayatri Apartment, Beside CGO Towers, Kavadiguda, Hyderabad-500 080

మహారాజశ్రీ Vవ, అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టు, ఏలూరు జిల్లా, ఏలూరు.,
ఎం.వి.ఓ.పి.నెం.159/2025

బిట్వీన్ :
వేగేశ్న రాజేశ్వరి మరియు ఇతరులు ...పిటిషనర్స్
మరియు
వి.రాధాకృష్ణ & Others ...రెస్పాండెంట్స్‌టు

1వ రెస్పాండెంట్ : వైదాని రాధాకృష్ణ, తండ్రి నరసింహ మూరిత, పురుషుడు, వయస్సు 55 సంవత్సరాలు, స్కూల్ బస్సు, డ్రైవర్ నెం.AP 05 TD 0423, R/o.H.నెం. B-II-188, BK ఎన్‌క్లేవ్, మక్త, మియాపూర్, సేరిలింగంపల్లి, హైదరాబాద్.

పై నెంబరు గ్రంథములో మీరు 1వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్ట్ ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ప్రతిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, ది.12-11-2025వ తేదీన పై నెంబరు గ్రంథములో శ్రీకోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తము వాయిదా అయి ఉన్నది. కావునా ఆ రోజు ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని, లేదా మీ అడ్వకేట్, గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల సదరు పై నెంబరు గ్రంథములో మీ యొక్క పరోక్షముగా విచారించబడును.

బద్ది వరహాలరావు, బద్ది శిరీష, బద్ది ఎం.ఎస్.ఎస్.వి.అవినాష్
న్యాయవాదులు, ఏలూరు.
సెల్: 9440653935, 9059911539

In the Debts Recovery Tribunal - I
Telangana at Hyderabad
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad 500 001

S.A.No. 377 of 2025

Between:

Sri.Gaddam Mohan Rao and others ...Applicant(s)
And
Shriram Finance Limited represented by its Authorized Officer and other ...Respondent(s)
To,
2. **Sri.Garine Saidaiah,** Male, son of Sri.Rama Lingaiah, aged about 60 years, Occupation: Business, M/s.Dhanush Traders, Plot No.257, Doctor's Colony, Road No.2, Hyderabad. House No.11-13-1063/2F, Flat No.204, SVC Vrishabadri Street No.8, Vasavi Colony, Saroornagar, Hyderabad 500 035 Ph.No. 9490404365
3. **Smt.Garine Yadamma,** Female, wife of Sri.Garine Saidaiah, aged about 57 years, Occupation: House Wife, resident of House No. 11-13-1063/2F, Flat No.204, SVC Vrishabadri Street No.8, Vasavi Colony, Saroornagar, Hyderabad 500 035 Ph.No. 9177308001
4. **Sri.Sarapu Pandurangam,** Male, son of Sri.Veeraiah, aged about 55 years, Occupation: Business, resident of Flat No.201, Aishwarya Gayari Homes, Mansoorabad, Hayathnagar, Ranga Reddy District 500 068
5. **Sri.Dumpala Venu,** Male, son of Bikshapathi, aged about 42 years, Occupation; Business, resident of House No.3-3-117, Enugulagadda, Hanamkonda, Hanamkonda District Aadhar No.4690 0341 0285
6. **Sri.Vasukala Devender,** Male, son of Sri.Muthaiah, aged about 52 years,Occupation: Agriculture, resident of House No.1-4-135/3, Krishnanagar Colony, Near Venkat Reddy Hospital, Kazipet, Hanamkonda Mandal, Warangal District **...Respondent(s)**

Please take Notice that, my client approached the Hon'ble Drt-1, Hyderabad by filing an I.A No. 2337 of 2025 in S.A No.377 of 2025 on the file of the DRT-1 Hyderabad, and the same is posted to 14-11-2025 for your Notice. Hence you are hereby called upon to appear on 14-11-2025 at 11.00 AM before Hon'ble PO, DRT-I, Hyderabad either in person or through your Advocate. Otherwise the matter will be decided on merits.

(BY ORDER OF THE HON'BLE TRIBUNAL)

Ch Kishore, Advocate
#SRT-192, OppRatnadeep Super Market, Hyderabad-500020
9849877390

రేపటినుంచి ప్రయివేటు కాలేజీల నిరవధిక బంద్

● 6న హైదరాబాద్‌లో లక్ష మంది సిబ్బందితో సమావేశం
● ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ తనిఖీలు సరికాదు
● రూ.900 కోట్లు విడుదల చేయాలి : రమేష్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్ చేపట్టాలని నిర్ణయించాయి. ఈనెల ఆరో తేదీన హైదరాబాద్‌లో లక్ష నుంచి లక్షన్నర మంది అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించాయి. ఈనెల 10 లేదా 11న పది లక్షల మంది విద్యార్థులతో సభను నిర్వహిస్తామని తెలిపాయి. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) చైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఫీజు బకాయిల్లో టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,200 కోట్ల వరకు ఉన్నాయని వివరించారు. దసరా నాటికి రూ.600 కోట్లు, మిగిలిన రూ.600 కోట్లు దీపావళి నాటికి ఇస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు రూ. 300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని చెప్పారు. మిగిలిన రూ.900 కోట్లు ఆదివారం నాటికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని అడిగితే విజిలెన్స్ తనిఖీలు చేపడతామంటూ బెదిరింపు ధోరణులకు దిగడం సరైంది కాదన్నారు. బంద్‌తోపాటు అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. అన్ని కాలేజీలూ ఫీజుల కోసం ఎదురుచూస్తుంటే కొన్ని కాలేజీలకు ప్రభుత్వం ఫీజులను మంజూరు చేసిందన్నారు. పది శాతం లంచం తీసుకుని ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయనీ, విజిలెన్స్ విచారణలో దీన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసౌకర్యం కలుగుతున్నందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు తమ బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫతి వైస్ చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫీజులివ్వాలంటూ ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేయాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. ఫీజులివ్వకుంటే భవిష్యత్తులో సామాజిక సమస్యగా మారుతుందన్నారు. టిపిడిఎంఎ అధ్యక్షులు బి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఫీజులిస్తామని హామీ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పిందని చెప్పారు. ఇప్పుడు విజిలెన్స్ తనిఖీలు చేపడతామంటూ బెదిరించడం సమంజసం కాదన్నారు. ఫీజు బకాయిల్లో 50 శాతం ఇప్పుడు విడుదల చేయాలనీ, మిగిలిన వాటిని మార్చి నాటికి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫతి కోశాధికారి కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె సునీల్‌కుమార్, ప్రతినిధులు రేపాక ప్రదీప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామినేని కుటుంబానికి వెంకట్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో శుక్రవారం హత్యకు గురైన రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాల సీనియర్ నాయకుడు సామినేని రామారావు కుటుంబ సభ్యులను శనివారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సంఘ రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, యర్రా శ్రీనుతో కలసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలియజేశారు. రామారావు హత్య గ్రామీణ పేదల పోరాటాలపై జరిగిన దారుణ రాజకీయ దాడి అని అన్నారు. ఆయన త్యాగాలు, ప్రజా ఉద్యమాలకు శాశ్వత ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & First Floor, 31-31-21, Sai Baba Street, Narayana Bhawan, Dabagardens, Visakhapatnam-530020

FORM No.4
((See Reguations - 15(1)(b))
NOTICE UNDER SECTION 17 OF SECURTIZATION ACT R/W PROVISIONS OF THE DEBTS RECOVERY TRIBUNAL ACT AND THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULES 1993 AS AMENED FROM TIME TO TIME

Summons under sub-section (4) of section 19 of the Act, real with sub-rule (2A) of rules 5 of the Debts Recovery Tribunal (procedure) Rules, 1993)

Case No.SA.633/2024

M.Satyanarayana & another
Vs
The authorized Officer, Utkarsh Small Finance Bank Ltd.,
R-1 : The authorized officer, Utkarsh Small Finance Bank Ltd., Zonal Office, D.No.7-1-24/2/c, 5th floor, Dhansi Surabhi Complex, Near Metro pillar No.C1419, Green Lands Begumpeta, Hyderabad-500016.

NOTICE

An application under section 17(1) of the Securitization & Reconstruction of financial Assests & Enforcement of Security Interest Act, 2002 has been filed before this Tribunal.

Show cause as to why the relief prayed for should not be granted. You are required to file reply if any, in your defense in the paper book from in two complete sets and produce all the documents and affidavit in your support in the tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before this Tribunal on 28-11-2025 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence. You are further directed to supply copy of the reply to the SA to the Counsel for the Applicant.

THE RESPONDENT SHOULD APPEAR BEFORE THIS TRIBUNAL ON 28-11-2025

Given under my hand and the seal of the this Tribunal on this date : 8-10-2025.
By Order of Tribunal

Registrar
Debts Recovery Tribunal, Visakhapatnam.

డబ్బు తీసుకుని ఓట్లు వేయమనడం అనైతిక చర్య


● ఎన్నికల కమిషన్ తక్షణమే కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలి
● టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ దగ్గర ఓటుకు ఐదువేల చొప్పున తీసుకుని కారు గుర్తుకే ఓటు వేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను అనైతిక చర్యగా టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని తక్షణమే ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. అహనా పెళ్ళంట సినిమా మాదిరిగా బిఆర్ఎస్ యువతకు ఉద్యోగాల ఆశ చూపించి, ఆ తర్వాత మోసం చేసిందని విమర్శించారు. ఐదేండ్లపాటు బిఆర్ఎస్ క్యాబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి కూడా లేకుండానే ప్రభుత్వాన్ని నడిపారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటేస్తే బిజెపికి వేసినట్టేనని తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్‌లో బిజెపి ప్రాధాన్యత లేని అభ్యర్థిని రంగంలో దించిందని తెలిపారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఎనిమిది సీట్లు విజయం సాధించేందుకు బీఆర్ఎస్ సహకరించిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ రుణం తీర్చుకునేందుకే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ పార్టీకి బిజెపి పరోక్షంగా అండగా నిలిచిందని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయంలో కెసిఆర్ పాత్ర ఉందని విమర్శించారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవిని నుంచి మొదలుకుని ట్రిపుల్ తలాక్ వరకు కెసిఆర్ బిజెపికి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది చేతగానితనం

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

నల్లగొండ జిల్లాలో ఎక్కడ చూసినా హృదయవిదారక దృశ్యాలే కనిపిస్తున్నాయని, పంటలు నష్టపోయి పుట్టెడు దు:ఖంలో రైతులు విలవిలలాడుతున్నారని మాజీమంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నల్లగొండ జిల్లాకేంద్ర సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన పిఎసిఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చేతకానితనం ఓ వైపు, ప్రకృతి ప్రకోపం మరో వైపు అన్నదాతలు బలైపోతుంటే జిల్లా మంత్రులు కమీషన్లు, సంపద మీదనే దృష్టి సారించారని విమర్శించారు. మంత్రులది దోచుకోవడం మీదనే దృష్టి పెట్టి రైస్ మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు లంచాలు మింగి వారికి సాగిలపడ్డారని విమర్శించారు. దీని ఫలితంగా మిల్లర్లు రైతులను పిక్కు తింటున్నారన్నారు. ఎక్కడ చూసినా మొలకలు వచ్చిన ధాన్యం కనబడుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఏడిపిస్తున్నదని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా షరతుల్లేకుండా కొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తండు సైదులు గౌడ్, గ్రంథాలయం మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, పాల్గొన్నారు.

శ్రామిక మహిళా పోరాటాలు తీవ్రతరం కావాలి

- మోడీ విధానాలతో పెరుగుతున్న అంతరాలు
- పోరాటాలతోనే హక్కుల్ని కాపాడుకోవాలి : తపన్‌సేన్



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా పేదలు, ధనికుల మధ్య రోజురోజుకు అంతరాలు పెరిగిపోతున్నాయి. ఇది నయా ఉదారవాద పెట్టుబడి దారి విధాన లక్షణం. ఈ విధానాలు చిన్న ఉత్పత్తిదారుల, రైతుల, చిన్నతరహా పరిశ్రమలను చిదిమేస్తున్నది.వీటి ప్రభావం శ్రామిక మహిళలపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే నిర్వహిస్తున్న శ్రామిక మహిళా పోరాటాలను మరింత ఉచ్ఛస్థితికి తీసుకుపోవాలి' అని సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటి 13వ అఖిలభారత సమ్మేళనాన్ని మెర్సి కుట్టియమ్మ అధ్యక్షతన నిర్వహించారు.

దీనికి ముందు సభా ప్రాంగణంలో సిఐటియు జెండాను ఆ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె హేమలత ఎగరేశారు. అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం తపన్‌సేన్ మాట్లాడుతూ ఈ ఏడాది చివరలో విశాఖ పట్నంలో జరుగనున్న సిఐటియు అఖిలభారత మహాసభల నేపథ్యంలో శ్రామిక మహిళా కన్వెన్షన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న పోరాటాల్లో శ్రామిక మహిళల పాత్ర పెరుగుతోందన్నారు. ప్రపంచంలో, దేశంలో సంక్షోభ పరిస్థితులు ముగింపుకు వస్తున్నాయంటూ, పెట్టుబడిదారీ తాబేదార్లు, మోడీ లాంటి వారు చెబుతున్నారన్నాని తెలిపారు. కానీ.. ఆర్థిక వ్యవస్థ స్తంభించిందనీ, తిరోగ మనంలో ఉందనే విషయాన్ని ఆర్థిక వేత్తలు చెబుతున్నారని వివరించారు. దేశంలో నిరుద్యోగం పేరుకు పోతున్నదనీ, పేదరికం పెరుగుతున్నదనీ, అత్యధిక మంది పేదలుగా మారుతున్నారని, తద్వారా అంతరాలు విపరీతంగా పెరుగుతున్నాయని వివరించారు. పెట్టుబడిదారీ విధానాన్ని మరింత వేగంగా అమలు చేయటం మూలంగా ఉపాధి కోతలు, కార్మిక హక్కుల మీద దాడి పెరిగిపోతున్నాయని చెప్పారు. ఈ దాడి కార్మిక వర్గం, మహిళల మీద కేంద్రీకరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధిలో కోత విధించటమంటే మహిళలను తగ్గించటమేనని చెప్పారు. మరో పక్క సామ్రాజ్యవాద శక్తులు సైనికంగా, ఆర్థికంగా బలపడుతున్నాయని గుర్తు చేశారు. ఇందులో ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి సంస్థలతోపాటు ద్రవ్య పెట్టుబడి కూడా కీలక పాత్ర పోషిస్తున్నదని వివరించారు. ఇది ఆధిపత్య వాదంతో అభివృద్ధి చెందుతున్న దేశాలపై దాడికి దారి తీస్తోందని చెప్పారు. ఇది భూ భౌగోళిక రాజకీయాల్లో మార్పుకు దారితీస్తున్నదని తెలిపారు. పాలస్తీనాపై జరుగుతున్నది అదేనని చెప్పారు. పాలస్తీనాలో అన్నం కోసం లైన్‌లో నిలబడ్డ 69 మంది పిల్లలను దుర్మార్గంగా చంపిన దుష్టచర్యను చూశామని వాపోయారు. ఎవరికీ ఇది పట్టదనీ, వర్గ సంఘాలు మాత్రమే దీన్ని ఎదిరించాలని సూచించారు. ఐదు నెలల్లో అమెరికాకు సంబంధించిన ఆయుధాల కంపెనీలు అపార లాభాలు గడించాయని తెలిపారు. చైనాపై సుంకాలు విధించటం, రష్యా నుంచి భారత్ చమురు దిగుమతిని ఆపాలనటం, సుంకాలు విధించటాన్ని చూస్తే ట్రంప్ అధిపత్య ధోరణి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. ఇలాంటి చర్యలను కార్మిక వర్గ ఉద్యమాలు మాత్రమే నిలవరిస్తాయని చెప్పారు. శ్రామిక మహిళలు అలాంటి పోరాటాలను నిర్వహించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలను కష్ట జీవులు భరించలేకపోతున్నారన్నారు. దీంతో కార్మికులు పోరాటాల్లోకి వస్తున్నారని చెప్పారు. అస్సాంలో ఒక వాడలో 200 పరిశ్రమలుంటే..అందులో మూడు పరిశ్రమల్లో మాత్రమే సిఐటియు ఉందని చెప్పారు. కానీ..జూలై 9 సమ్మెలో అన్ని పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. కార్మికులందరికి ప్రభుత్వాల విధానాలను అర్థం చేయించటమనేది కర్తవ్యంగా ఉండాలన్నారు.'శ్రమ శక్తి నీతి' పేర కార్పొరేట్లు తమ ముసుగు తొలగించారని చెప్పారు. ఈ రకంగా పచ్చిగా దోపిడీకి వారు తెగబడుతున్నారని డ్డారని విమర్శించారు. 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చిన విషయం తెలిసిందేనన్నారు. సమ్మిళిత వృద్ధితో కార్మికులను ఆదుకుంటామని చెబుతూ కార్మికులను చట్టాల అవలకు నెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన మనుస్మృతి వంటి వాటిపై ఆధారపడ్డ నీతి రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేయటంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అయినా..యూపీ ముఖ్యమంత్రి యోగి ఆధిత్య నాథ్ అయినా ఒకే పద్దతి అనుసరిస్తారని చెప్పారు. కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా నికరంగా నిలబడితే..కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోందని చెప్పారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించినందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అక్కడి ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతోందని తెలిపారు. కుట్ర పూరితమైన గొంతు నులిమే పద్ధతికి కేంద్రం తెగబడుతోందని విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక పోరాటాలను ఉచ్ఛస్థితికి తీసుకుపోవటమే దీనికి విరుగుడని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె హేమలత, కోశాధికారి ఎం సాయిబాబు, శ్రామిక మహిళా కన్వీనర్ ఎఆర్ సింధు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆఫీసు బేరర్లు ఉషారాణి, కెఎన్ ఉమేశ్, సుదీప్ దత్త, బేబీరాణి, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వి రమ, సిఐటియు ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం చింతకుంటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంటకు చెందిన రైతు పిట్టల కిష్టయ్య (64) తనకున్న ఐదు ఎకరాలల్లో పత్తి సాగు చేశారు. వరుసగా కురిసిన వర్షాలతో పంట దెబ్బతింది. పంట కోసం తెచ్చిన పెట్టుబడులు, ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువులు, విత్తనాలు తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాల్సి ఉంది. అలాగే బ్యాంకులో దాదాపు రూ.రెండు లక్షల రుణం ఉంది. అప్పులు ఎలా తీర్చాలనే ఆలోచనలతో మానసిక ఒత్తిడికి గురై ఆవేదనలో కిష్టయ్య ఆత్మహత్యకు దారితీసింది. శుక్రవారం సాయంత్రం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సభ్యులు వెంటనే సిర్పూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల తరలిస్తుండగా మార్గమధ్యతో మరణించారు.

'సోయా' టోకెన్ల కోసం రైతుల తోపులాట

- ఇద్దరు మహిళల రైతులకు గాయాలు
- అర్ధరాత్రి నుంచి రైతుల అవస్థలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు ఆది నుంచి కష్టాలే, పంట విత్తుకోవడం నుంచి పంట అమ్ముకునే వరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుకు చివరకు మద్దతు ధర లభించడం లేదు. నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా శనివారం నుంచి సోయా కొనుగోళ్ల కొరకు టోకెన్‌లు పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి బారులు తీరారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో సోయా రైతులు తరలి రావడంతో క్యూలైన్ల పరిస్థితి గందరగోళంగా మారింది. సహకార సంఘం కార్యాలయం గద్దె వద్ద టోకెన్ల కోసం తోపులాటలో పలువురు మహిళలు కింద పడ్డారు. కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఉన్నప్పటికీ రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పరిస్థితి అదుపు తప్పింది. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి, భైంసా రూరల్ సిఐ నైలు నాయక్ టోకెన్లు జారీ చేసే కేంద్రం వద్దకు చేరుకొని .. ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ పత్రాలను ముందుగా తీసుకొని టోకెన్లను జారీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. తహసీల్దార్ శివరాజ్, ఏఓ సారిక, సహకార సంఘం కార్యదర్శి క్రాంతి కుమార్ హాజరై మలేగాం, పల్సి, చాత గ్రామాలలో సోయా కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తొమ్మిది వ్యవసాయ క్లస్టర్లలో గల రైతు వేదికల్లో ఏఈఓలతో టోకెన్ల జారీ చేసే ప్రక్రియను కొనసాగించాలని కోరారు. కలెక్టర్ దృష్టి సారించి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేశారు. నిర్మల్ జిల్లాలోనే 43 జిపిలు కలిగిన అతి పెద్ద మండలం కుభీర్ కావడం విశేషం. మండలంలో 76 గ్రామాలు ఉండగా, 43 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సుమారు 23వేల ఎకరాల్లో రైతులు సోయా పంటను సాగుచేశారు.



ర్యాలీగా వెళుతున్న గ్రామస్తులు

వ్యర్థ రసాయనాలతో ఎర్రకుంటగా మారిన నల్లకుంట

- కాలుష్య వ్యతిరేక పోరాట రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

వ్యర్థ రసాయనాలతో నల్లకుంటను ఎర్రకుంటగా మార్చిన హెటిరో డ్రగ్స్ యూనిట్ 1 పరిశ్రమను వెంటనే ఎత్తివేయాలని దోమడుగు గ్రామస్తులు డిమాండ్ చేశారు. కాలుష్య వ్యతిరేక పోరాట రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం దోమడుగు పురవీధులతోపాటు బొంతపల్లి కమాన్ ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బాబురావు మాట్లాడుతూ.. పరిశ్రమల యాజమాన్యాలతో వివిధ పార్టీల నాయకులు అధికారులు వాళ్ళ ఇచ్చిన తాయిలాలకు తలొగ్గి సామాన్య ప్రజలకు జరుగుతున్న ముప్పును పట్టించుకోవడం లేదన్నారు. ఎందరో పర్యావరణ ప్రేమికులు గ్రామాన్ని సందర్శించినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించడంలో అలసత్వం వీడాలన్నారు. పరిశ్రమ యాజమాన్యాలు ఇస్తున్న నజరానాలకు తలొగ్గకుండా గ్రామీణ ప్రజల ప్రాణాల ముప్పును పరిగణనలోకి తీసుకొని వెంటనే సంబంధిత అధికారులు రసాయన వ్యర్థ జలాలను వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే నల్లకుంటను పరిశీలించి సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్కడ అనుమతులు... ఇక్కడ నిర్మాణాలు

- మియాపూర్లో అక్రమ కట్టడంపై హైడ్రా కొరడా
- ప్రభుత్వ భూమిలో నిర్మించిన 5 అంతస్తుల భవనం కూల్చివేత

ప్రజావక్తి - హైదరాబాద్ బ్యూరో



రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లో కోట్లాది రూపాయల విలువచేసే ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌ను శనివారం హైడ్రా కూల్చివేసింది. అక్రమ నిర్మాణాల విషయంలో దూకుడుగా వెళ్తోన్న హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చిన వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేసింది. హైడ్రా పరిశీలనలో సదరు భవనం, నిర్మాణ స్థలం అక్రమమని తేలింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందు జాగ్రత్తగా భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి పని పూర్తి చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపిన వివరాల మేరకు.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని సర్వే నెంబర్ 337, 338 పక్కనే ఉన్న మియాపూర్ 101 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాచేశారు. అమీన్‌పూర్‌లోని సర్వే నంబర్ 337, 338లలో హుడా అప్రూవ్డ్ లేఅవుట్‌లో (400 గజాలలో 126 నెంబర్) ప్లాట్ కొనుగోలు చేసిన భాను కన్‌స్ట్రక్షన్స్ యజమానులు ఆ పక్కనే మియాపూర్‌లోని సర్వే నంబర్ 101 ప్రభుత్వ స్థలంలోకి చొరబడి ప్లాట్లు సృష్టించారు. హెచ్‌ఎండీఏ భూమిలోని దాదాపు 473 గజాలు కలుపుకొని భాను కన్‌స్ట్రక్షన్స్ యజమానులు ఎల్లారెడ్డి అండ్ అదర్స్ మొత్తం దాదాపు 873 గజాల మేర 5 అంతస్తుల భవనం నిర్మించారు. తప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌ను సృష్టించిన భాను కన్‌స్ట్రక్షన్స్ యజమానులు డిడిలను సైతం ఫేక్‌వి తయారు చేశారు. ఇప్పటికే వారిపై అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో అధికారులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిలోకి చొరబడి చేపట్టిన నిర్మాణం కావడంతో స్థానిక రెవెన్యూ, హెచ్‌ఎండిఎ, మున్సిపాలిటీ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. అన్ని డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత ఐదంతస్తుల భవనాన్ని హైడ్రా నేలమట్టం చేసింది.



పోలీసుల సేవలు నిరుపమానం

- ఎంఇఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి
- అమెరికన్ కాన్సులేట్ భద్రతా సిబ్బందికి వసతి ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

పోలీసుల సేవలు నిరుపమానమని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) డైరెక్టర్ పి సుధారెడ్డి అన్నారు. రాత్రి, పగలనకా ప్రజల భద్రతకు పోలీసులు చేస్తున్న కృషి వెల కట్టలేనిదని అన్నారు. హైదరాబాద్‌లోని నానక్ రామ్‌గూడ లో ఉన్న అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద భద్రతా విధులు నిర్వర్తించే తెలంగాణ స్పెషల్ పోలీసులు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన భవన నిర్మాణాన్ని ఎంఇఐఎల్ సొంత ఖర్చులతో చేపట్టింది. ఈ భవన నిర్మాణానికి శనివారం సుధారెడ్డి శంఖుస్థాపన చేశారు. 50 మంది భద్రతా సిబ్బంది వినియోగించుకునేలా ఈ భవనాన్ని డిజైన్ చేశారు. ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పద్ధతిలో త్వరగా ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి పోలీస్ సిబ్బందికి ఎంఇఐఎల్ అందించనుంది. ఈ శంఖుస్థాపన కార్యక్రమంలో బెటాలియన్స్ అదనపు డిజిపి సంజయ్ కుమార్ జైన్, మాదాపూర్ డిసిపి రితిరాజ్ , కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ ఎం రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్‌లు ఎం పార్ధసారధి రెడ్డి, ఎస్.రాంబాబు, అమెరికన్ కాన్సులేట్ భద్రతా అధికారులు వెంకట్, సతీష్, రవిచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్ కేరాఫ్ రేవ్‌పార్టీ

- వీకెండ్స్‌లో జల్సాలు
- అక్రమ నిర్మాణాల్లో అసాంఘిక కార్యక్రమాలు
- మొయినాబాద్‌లో అత్యధికం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫామ్‌హౌస్‌లు అసాంఘీక కార్యకలపాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. వీకెండ్ వచ్చిందంటే చాలు.. రేవ్, ముజ్రా పార్టీలకు అడ్డాగా మారుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌ల్లో ప్రత్యేక ఈవెంట్ల పేరుతో యువతకు గాలం వేస్తున్నారు. విదేశీయులతో చిందులు, విందులు ఏర్పాటు చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. అన్‌లైన్‌లో ప్రత్యేక పేజీలు నిర్వహిస్తూ.. యువతను ఏకం చేసి.. పార్టీలు నిర్వహిస్తున్నారంటే.. పరిస్థితి ఏ తీరుగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పెద్దమొత్తంలో ఫామ్‌హౌస్‌లు ఉండటం, వాటిల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. అయితే అడపదడపా పోలీసులు దాడులు నిర్వహించి, పలువురిని అరెస్టు చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో కట్టడి చేయలేని పరిస్థితి ఉంది. రేవ్, ముజ్రా పార్టీలకు కేరాఫ్‌గా మారిన ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు వెయ్యికి పైగా ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మొయినాబాద్‌లో సుమారు 500 వరకు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మొయినాబాద్ ప్రాంతం 111 జీవో పరిధిలో ఉండటంతో ఇక్కడ పెద్ద, పెద్ద నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం లేకపోవడంతో ఈ ప్రాంతం మొత్తం ఫామ్‌హౌస్‌కు అండగా మారింది. ఈ ప్రాంతంలో మొదట్లో సినీ ఇండస్ట్రీకి చెందిన కొంత మంది ప్రముఖులు ఖాళీ సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. విశ్రాంతి భవనాలు కాస్తా.. అసాంఘీక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం మొయినాబాద్ ప్రాంతంలో వ్యాపారం నేపథ్యంలోనే ఫామ్‌హౌస్‌లు నిర్మిస్తున్నారు. మొయినాబాద్‌లో మొదలైన ఫామ్‌హౌస్ కల్చర్ ప్రస్తుతం జిల్లా మొత్తం పాకింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఫామ్‌హౌస్‌లు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు. మంచాల మండలంలో ఫామ్‌హౌస్‌లు నిర్మించి.. అన్‌లైన్‌లో యువతను ఎట్రాక్ట్ చేసి పార్టీలు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. శంషాబాద్, రాజేంద్రనగర్, షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, జన్వాడ, మొయినాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ఎక్కువ సంఖ్యలో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. కొంతమంది వీటిని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు.

ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు :

ఇటీవల మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో మైనర్ల ముజ్రా పార్టీ నిర్వహించారు. నగరానికి చెందిన ఒక వ్యక్తి డీజే ఇన్‌స్టాలో ట్రాప్‌హౌస్ పేరుతో అకౌంట్ నిర్వహించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ట్రాప్‌హౌస్ నిర్వహిస్తున్నట్టుగా విపరీతంగా ప్రకటనలు గుప్పించి అందరినీ ఊరించాడు. ఒక్కరికైతే రూ.1,600, జంటగా వస్తే రూ.2,800గా నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఇది చూసి మైనర్లు పార్టీకి సిద్ధమయ్యారు. మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో పార్టీ నిర్వహించారు. పోలీసులకు ఈ సమాచారం అందడంతో ఫామ్‌హౌస్‌పై దాడులు నిర్వహించి, 59మందిని పట్టుకున్నారు. ఇందులో 22 మంది మైనర్లు ఉన్నారు. అందులో 5 మంది అమ్మాయిలు ఉండగా, మరో 17 మంది అబ్బాయిలు ఉన్నారు. అలాగే మంచాల మండలం లింగంపల్లిలో కొద్దిరోజుల క్రితం ఓ ఫామ్‌హౌస్‌లో ముజ్రాపార్టీ నిర్వహించగా.. పోలీసులు దాడులు చేసి పలువురిని అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కొకొల్లలు. అయితే ఈ ఘటనల నేపథ్యంలో.. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఫామ్ హౌస్ నిర్వాహకులతో మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ముజ్రా పార్టీలు నిర్వహిస్తే.. చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంతటితో సరి పెట్టకుండా.. పకడ్బందీ చర్యలు తీసుకుని, అసాంఘిక కార్యక్రమాలను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





పవర్‌గ్రిడ్‌కు తోషిబా 220 కెవి ఎం-జిఐఎస్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశీయంగా తయారైన తొలి 220కెవి మొబైల్ గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (ఎం-జీఐఎస్) వ్యవస్థను పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు అందించినట్టు తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టిటిడిఐ) తెలిపింది. తెలంగాణ పటాన్‌చెరులో టిటిడిఐ తయారీ కేంద్రంలో ఈ స్విచ్ గేర్‌ను అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. స్థలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధిక వోల్టేజీ విద్యుత్ పంపిణీకి జిఐఎస్ వ్యవస్థను ఉపయోగిస్తారని కంపెనీ తెలిపింది. పవర్‌గ్రిడ్ ఆపరేషనల్ అవసరాలకు అనుగుణంగా 220కె ఎం-జిఐఎస్ వ్యవస్థను రూపకల్పన చేశామని టిటిడిఐ సిఎండి హిరోషి పురుటా తెలిపారు. దేశంలో తొలి 220కెవి ఎం-జిఐఎస్ పరిష్కారం అందించడం తమకు ఒక గొప్ప విజయంగా నిలిచిందన్నారు. మరిన్ని ఎం-జిఐఎస్ పరిష్కారాలను విడుదల చేస్తామన్నారు.



ఐడిబిఐ బ్యాంక్ విజిలెన్స్ అవేర్‌నెస్ వాకథాన్

ప్రజాశక్తి - హైదరాబాద్

సమగ్ర బ్యాంకింగ్ సేవలు, పారదర్శకత, నైతిక పద్ధతులపై అవగాహన పెంచడానికి ఐడిబిఐ బ్యాంక్ శనివారం వాకథాన్‌ను నిర్వహించింది. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా దీన్ని హైదరాబాద్‌లోని చాపెల్ రోడ్‌లో జోనల్ ఆఫీసు వద్ద నుంచి ఎల్‌బి స్టేడియం చుట్టూ జరిపింది. ఉద్యోగులు, కస్టమర్లు, సామాన్య ప్రజలలో అవినీతిని అరికట్టడంతో పాటుగా మెరుగైన గవర్నెన్స్ ప్రోత్సహించడానికి ఈ క్యాంపెయిన్ ప్రధాన ఉద్దేశ్యమని ఆ బ్యాంక్ జోనల్ హెడ్ జనకీరమన్, డిప్యూటీ జోనల్ హెడ్ కరీంలాల్ పేర్కొన్నారు. ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత బ్యాంకింగ్ చిట్కాలను ఉపయోగించాలని వారు సూచించారు.



సుమధుర గ్రూప్ 'బ్రాండెడ్ క్లబ్‌హౌస్' ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ రియాల్టీ డెవలపర్ సుమధుర గ్రూప్ ఆధునిక కమ్యూనిటీ జీవనాన్ని పునర్నిర్వచించడానికి హైదరాబాద్‌లో బ్రాండెడ్ క్లబ్‌హౌస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లోని సుమదుర్ అల్ట్రా లగ్జరీ ప్రాజెక్టు పాలైస్ రాయల్ నివాస సముదాయంలో ఐలెసియా క్లబ్స్ భాగస్వామ్యంతో దీన్ని ఆవిష్కరించింది. ఇక్కడ క్రీడలు, ఫిట్‌నెస్, వెల్‌నెస్, వినోదంలో ప్రత్యేక చొరవ అని తెలిపింది. దీంతో హైదరాబాద్, బెంగళూరులోని ప్రీమియం రెసిడెన్షియల్ కమ్యూనిటీలలో తొలి బహుళ నగర బ్రాండెడ్ క్లబ్‌హౌస్‌ను ప్రారంభించినట్లయ్యిందని సుమధుర గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్ జి తెలిపారు. సెలబ్రిటీలు, వ్యాపారస్తుల మనసులను 35 ఏళ్లుగా గెలుచుకుంటున్నామన్నారు. 'హైదరాబాద్ ఒక ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఇది అత్యధిక, అధిక సంపన్నులు, ఎన్‌ఆర్‌ఐలు, అంతర్జాతీయ నిపుణులను ఆకర్షిస్తోంది. ఈ నగరం అల్ట్రా లగ్జరీ నివాసాలకు అపూర్వమైన డిమాండ్‌ను అందిస్తోంది. ప్రతిష్టాత్మక చిరునామా కంటే వారు మరికొన్ని ఆశిస్తున్నారు. డిజైన్, వెల్‌నెస్, జీవనశైలిలో అంతర్జాతీయ ప్రమాణాలను కోరుకుంటున్నారు," అని మధుసూదన్ జి తెలిపారు. "భారతదేశపు వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఉండటంతో పాటు ఆధునిక గృహ కొనుగోలుదారుల అభివృద్ధి చెందుతున్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది" అని ఐలెసియం క్లబ్స్ ఫౌండర్ పవిత్ సింగ్ పేర్కొన్నారు.



కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటయ్య

కానిస్టేబుల్ హత్య ఎంతో బాధ కలిగించింది

- ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ప్రమోద్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కానిస్టేబుల్ హత్య ఎంతో బాధ కలిగించిందని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. హత్యకు గురైన సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ప్రమోద్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బాధిత కుటుంబానికి కమిషన్ అండగా నిలుస్తుందని, పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. చైర్మన్ వెంట ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ, అభివృద్ధి శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు ఉన్నారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్‌సి, ఎస్‌టిలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డ్ కులాలు, తెగలవారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. ఐడిఒసికి చేరుకున్న కమిషన్ చైర్మన్‌ను కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.